చిట్టి చేతుల్లో మట్టి గణపతి





'చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు' శిక్షణ శిబిరాన్ని జ్యోతి వెలిగించి, ప్రారంభిస్తున్న శ్రీ షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య



మట్టి గణపతులను తయారు చేస్తున్న విద్యార్థులు

- 'సాక్షి' మీడియా గ్రూప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం
- ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు
- షిర్డీసాయి విద్యా నికేతన్‌లో సందడి



ప్రథమ బహుమతి: జి.రామకృష్ణ



ద్వితీయ బహుమతి: కె.మహిత్



తృతీయ బహుమతి: ఎం.వినయ్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎస్.అబ్రహం పిలుపునిచ్చారు. 'సాక్షి' మీడియా గ్రూపు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యాన రాజమహేంద్రవరం ఆల్ బ్యాంక్ కాలనీలోని డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్లో (షిర్డీసాయి విద్యా నికేతన్ క్యాంపస్) 'చిన్నారుల చేతుల్లో మట్టి గణేశుడు' శిక్షణ శిబిరం శుక్రవారం జరిగింది. దీనికి జిల్లా స్పాన్సరర్‌గా షిర్డీసాయి విద్యాసంస్థలు వ్యవహరించాయి. ఈ కార్యక్రమానికి వివిధ స్కూళ్లకు చెందిన ఐదేళ్ల నుంచి 16 ఏళ్ల లోపు చిన్నారులు 500 మంది హాజరయ్యారు.

జ్యోతి ప్రకాశనంతో..

షిర్డీసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య జ్యోతి వెలిగించి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ అబ్రహం మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలంటూ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు ఇంటికి వెళ్లి తమ తల్లిదండ్రులకు కూడా ఈ విషయం తెలియజేయాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగంతో అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. షిర్డీసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ ఎకో ఫ్రెండ్లీ గణేష్ కార్యక్రమంలో తమను భాగస్వాముల్ని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ బి.కరుణశ్రీ మాట్లాడుతూ, వినాయక చవితిని కాలుష్య రహితంగా చేసుకోవాలని అన్నారు.

విజేతలు వీరే..

ఈ పోటీలకు డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్ (షిర్డీసాయి విద్యానికేతన్), ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ప్రతిభ ఎడ్యుకేర్, ప్రకాష్ విద్యాసంస్థలు, ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం స్కూల్, హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొమ్మూరు జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ బహుమతిని జి.రామకృష్ణ (డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్), ద్వితీయ బహుమతిని కె.మహిత్ (ట్రిప్స్ స్కూల్), తృతీయ బహుమతిని ఎం.వినయ్ (ప్రతిభ ఎడ్యుకేర్), కన్సోలేషన్ బహుమతులను ఎస్.మహాలక్ష్మి, యు.గీతాశ్రీ (ఎస్‌కేవీటీ స్కూల్), కె.సెల్విక్, ఎస్.జూహిత (ప్రకాష్), కె.పల్లవి, పీఎస్ఎస్ రక్షిత (ట్రిప్స్ స్కూల్), ఆర్.మహీధర్ (ప్రతిభ ఎడ్యుకేర్), ఇ.గణేష్ సాయిరామ్, కె.మోహన్ (హుకుంపేట హైస్కూలు), పి.జశ్వంత్, ఎస్.శ్రీధరణి (బొమ్మూరు జీపీఆర్ హైస్కూల్), ఐ.జశ్వంత్, కె.హర్షిత (డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్), పి.తేజ (మాస్టర్ మైండ్స్, కడియం) గెలుచుకున్నారు. వారికి ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా క్రాఫ్ట్ టీచర్లు పి.లీలావతి, దంగేటి దుర్గశ్రీ, ఎస్‌జీటీ ఏఎల్ నరసింహారావు వ్యవహరించారు. కార్యక్రమంలో 'సాక్షి' రీజినల్ మేనేజర్ ఎస్.రమేష్‌రెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ షేక్ ఫయాజ్, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ కె.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



'చిన్నారుల చేతిలో మట్టి గణేశుడు' శిక్షణ శిబిరంలో విజేతలతో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, శ్రీ షిర్డిసాయి విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఏఈ కరుణశ్రీ, సాక్షి రీజినల్ మేనేజర్ రమేష్‌రెడ్డి తదితరులు

సృజనాత్మకత



'సాక్షి' మీడియా గ్రూప్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా చేపట్టిన చిన్నారుల చేతిలో మట్టి గణేశుడు కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుంది. మట్టితో వినాయక ప్రతిమ తయారు చేయించడం ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, ఏకాగ్రత పెరుగుతాయి. ప్రతి ఒక్కరూ ఎకో ఫ్రెండ్లీ గణపతిని పూజించేలా చేపట్టిన ఈ కార్యక్రమం చిన్నారులను ఆలోచింపజేస్తుంది. అందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి.

– తంబాబత్తుల శ్రీధర్, చైర్మన్, షిర్డీసాయి విద్యాసంస్థలు, రాజమహేంద్రవరం

పర్యావరణ పరిరక్షణ



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలి. మన సంప్రదాయం కూడా అదే. ఇటీవల రసాయన రంగుల విగ్రహాల వాడకం ఎక్కువైంది. వీటిని నిమజ్జనం చేసిన తర్వాత ఆ రంగుల వల్ల జలచరాలకు హాని కలుగుతోంది. ఇది పర్యావరణానికి పెనుముప్పు. దీనిని మనందరం అరికట్టాలి. తేలికపాటి రంగులు వినియోగించి చేసిన మట్టి విగ్రహాలను మాత్రమే చవితి పందిళ్లల్లో పెట్టాలి.

– బి.కరుణశ్రీ, అసిస్టెంట్ ఇంజినీర్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, కాకినాడ

ఆనందంగా ఉంది

చదువుతో పాటు క్రాఫ్ట్స్ తయారీకి పాఠశాల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ దిశగా మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రతి ఏడాదీ మట్టి గణపతుల తయారీలో పాల్గొంటున్నాను. ఈసారి ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

– జి.రామకృష్ణ, డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్, రాజమహేంద్రవరం

10 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

గోపాలపురం: కరగపాడు పంచాయతీ పరిధిలోని కరగపాడు, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారిని కొవ్వూరు కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. బొమ్మి లక్ష్మణరావు , అయ్యప్ప అనే వారి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

డ్రెయిన్‌కు శంకుస్థాపన

చాగల్లు: చాగల్లు శివారు మీనానగరంలో జెడ్పీ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించే ప్రధాన డ్రైన్‌కు శుక్రవారం ఎంపీపీ మట్టా వీరాస్వామి శంకుస్థాపన చేశారు. వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయ శ్రీనివాస్, ఉప సర్పంచ్ మేకా రాజు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల, పార్టీ మండల, సచివాలయ కన్వీనర్ల సమీక్ష సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు దేవరపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు.

ఏటీఎల్ మారథాన్‌ను గురుకుల పాఠశాల ప్రాజెక్ట్

గోపాలపురం: ఏటీఎల్ మారథాన్‌కు గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్ట్ ఎంపికైందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారథాన్ -2023కు దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి మొత్తం 1200 ప్రాజెక్టులు వచ్చాయి. వాటిలో 400 ప్రాజెక్టులను నీతి ఆయోగ్ గురువారం ఎంపిక చేసిందని ప్రిన్సిపాల్ తెలిపారు. వాటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 24 పాఠశాలల ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో జిల్లా నుంచి గోపాలపురం గురుకుల బాలికల పాఠశాల నుంచి పేటెంట్ హెల్త్ మానిటరింగ్ సిస్టం ఎంపికైనట్టు వివరించారు. ప్రాజెక్ట్‌ను తయారు చేసిన కె.అనూష, వినూత్నలను పలువురు అభినందించారు.

ప్రజారోగ్యానికి సీఎం పెద్దపీట

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించిన జగన్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రాజమహేంద్రవరం మెడికల్ కాలేజ్ ప్రారంభోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాదాపు రూ.8,480 కోట్లతో 17 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. విజయనగరంలో నూతన వైద్య కళాశాలను శుక్రవారం ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అనంతరం వర్చువల్ విధానంలో రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి మంత్రి వనిత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం మరో ఐదు, ఆ తర్వాత ఏడాది మిగిలిన ఏడు ప్రభుత్వ వైద్య కళాశాలలను సీఎం జగన్ ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రతి వైద్య కళాశాలను రూ.500 కోట్లతో చేపట్టనున్నారన్నారు. 8.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీచింగ్ హాస్పిటల్, 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ, 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హాస్టళ్లు, సిబ్బంది వసతి, క్రీడా ప్రాంగణాలతో పాటు అత్యాధునిక సాంకేతికతతో లేబొరేటరీలు, డిజిటల్ లైబ్రరీ, సీసీ టీవీల ఏర్పాటు ద్వారా ఆధునిక హంగులు కల్పిస్తున్నారని వనిత వివరించారు.

కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ మన రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఏర్పాటు కాగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో మరో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. జిల్లాలో మల్టీ/సూపర్ స్పెషాలిటీ అధునాతన వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఆ దిశలో ప్రభుత్వాసుపత్రిని 500 పడకలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరాన్ని విద్యా హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసినందుకు జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి వాటి ద్వారా వైద్యాధికారులు ప్రజల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్నారని అన్నారు.

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా వేగంగా ముందుకు అడుగులు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

రానున్న రోజుల్లో ఈ ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ(రుడా) మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి కోసం ఎదురుచూపులు

- నిడదవోలులో పండగ వాతావరణం
- సీఎం జగన్‌కు పట్టణంలో భారీ స్వాగత ఏర్పాట్లు
- అన్ని కూడళ్లలో ఫ్లెక్సీలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



ముఖ్యమంత్రి బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలకు కోసం..



సీఎం జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నిడదవోలు: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నాటి నిడదవోలు పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్విచ్ ఆన్ చేసి రాష్ట్రస్థాయి కాపునేస్తం నాలుగో విడత నిధులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా నిడదవోలులో పండగ వాతావరణం నెలకొంది. జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ పట్టణంలోని ప్రతి కూడలిలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటవుట్‌లు వెలిశాయి. ప్రతి సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతూ స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు పట్టణానికి రావడం ఇది రెండోసారి. గతంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి కుమార్తె వివాహానికి ఆయన ఇక్కడకు వచ్చారు.

పోలీసుల విస్తృత బందోబస్తు

శనివారం నాటి ముఖ్యమంత్రి నిడదవోలు బహిరంగ సభకు తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి భారీ ఎత్తున జనం తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం పట్టణంలో నాలుగు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్లాది నిధులు మంజూరు చేసిన జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు, ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. పట్టణంలోని సుబ్బరాజుపేటలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి 1.04 కిలోమీటర్ల దూరంలో బహిరంగ సభావేదిక ఉంది. ఈ 1.04 కిలోమీటర్ల మేర ముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహిస్తారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు రోడ్ షో పొడువునా రోడ్డుకు ఇరువైపులా వేలాదిగా జనం వేచి ఉంటారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. హెలిప్యాడ్ వద్ద నుంచి సభా వేదిక వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

భారీఎత్తున అభివృద్ధి, సంక్షేమం

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా నిడదవోలు నియోజకవర్గానికి రూ.1350 కోట్లు ఖర్చు చేసింది. అలాగే మరో రూ.650 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. వారి కొన్ని ఇప్పటికే పూర్తవగా, మరికొన్ని పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాజా నిడదవోలు పర్యటన సందర్భంగా నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించే అవకాశం ఉంది. సీఎం మరిన్ని నిధులు కేటాయిస్తే నియోజకవర్గంలోని పలు సమస్యలు పరిష్కారం అవుతాయని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. సీఎం నిడదవోలు పర్యటన కోసం ఎమ్మెల్యే జి శ్రీనివాస్‌నాయుడు అహర్నిశలూ పనిచేసి, అధికారుల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఆయన కోరారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

చాగల్లు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వేను శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. ఎంపీడీఓ బి.రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వీరాస్వామి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

నిడదవోలు రూరల్: ప్రతి ఇంటా ఆరోగ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తాడిమళ్ల పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం ఆమె సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లతో పాటు వలంటీర్లు వెళ్లి ప్రజారోగ్యంపై సర్వే చేస్తారన్నారు. అనంతరం ఈనెల 30వ తేదీ నుంచి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల పరిధిలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.సుధీర్‌కుమార్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్షపై చిట్యాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటారన్నారు.హుకుంపేట ఆసుపత్రి పరిధిలోని చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కరిష్మా తెలిపారు. ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు ముచ్చికర్ల రవి, గద్దే సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో వన మహోత్సవం

నిడదవోలు: బీజేపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సోము వీర్రాజు హాజరయ్యారు. ముందుగా గణేష్ సెంటర్లోని గణపతి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కాలేపు సత్యసాయి, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు నీలం రామారావు, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి అధ్యక్షులు మాట్ల దుర్గారావు, బూరుగుపల్లి శివరామకృష్ణ, గంగాధర్ నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

జానకమ్మ సెంచరీ

వృద్ధురాలికి 100వ జన్మదిన వేడుకలు



ఖండవల్లి జానకమ్మకు 100వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

గోపాలపురం: మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన ఖండవల్లి జానకమ్మకు శుక్రవారంతో నిండు నూరేళ్లు నిండాయి. దాంతో కుటుంబ సభ్యులు ఆమెకు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. మనుమలు, మనుమరాండ్రు సుమారు 25 మంది వరకూ ఉన్నారు.

రోగులకు వైద్య నిపుణుల సేవలు

ఉండ్రాజవరం: మూడో శుక్రవారం సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు సేవలు అందించారు. ప్రసూతి వైద్య నిపుణురాలు మృదుల 15 మందికి, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు మేరీ వసంత ఐదుగురిని పరీక్షించారు. వారికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు.





జగనన్నకు ఆత్మీయ స్వాగతం పలుకుదాం

- నేటి ముఖ్యమంత్రి నిడదవోలు పర్యటనకు తరలి రండి
- ప్రజాప్రతినిధులకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు మంత్రి వనిత పిలుపు
- కొవ్వూరులో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నిడదవోలు పర్యటనకు శనివారం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం ఆత్మీయ స్వాగతం పలుకుదామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. సమావేశంలో మంత్రి వనిత మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు తరలి వెళ్లే పార్టీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. పార్టీ నాయకులు కూడా ప్రణాళికాబద్ధంగా పని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. నిడదవోలులోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూలు మైదానంలో శనివారం ఉదయం పది గంటలకు ముఖ్యమంత్రి బహిరంగ ప్రారంభం అవుతుందన్నారు. ఏర్పాట్లపై మంత్రి మండలాల వారీగా పార్టీ నాయకులతో సమీక్షించారు. వారికి పలు సూచనలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ, మట్టా వీరాస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

ఉండ్రాజవరం: వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదలకు శనివారం నిడదవోలు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే గాకుండా జగన్ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు పొందిన ప్రతి ఒక్కరూ సీఎంకు కృతజ్ఞతలు తెలుపు కోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మండలంలో 15 గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి సీఎం సభను విజయవంతం చేయాలని కార్యకర్తలను, ప్రజలను కోరారు.

పెరవలి: ముఖ్యమంత్రి బహిరంగ సభకు మండలం నుంచి నిడదవోలు తరలి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు స్వయంగా దగ్గరుండా చూసుకోవాలని ఎంపీపీ కార్నెల్ల ప్రసాద్ కోరారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖండవల్లిలో సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీవో దామోదర రావు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ పెరవలి మండలం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకదామన్నారు. ఎంపీడీఓ దామోదరరావు మాట్లాడుతూ సభకు వచ్చేవారికోసం ప్రత్యేకంగా బస్‌లు ఏర్పాట్లు చేశామన్నారు.



నేడు పాఠశాలలకు సెలవు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్స్ పేరెంట్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం జిల్లాలో పాఠశాలలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సోమవారం వినాయక చవితి పండగ నేపథ్యంలో శనివారం స్కూళ్లకు సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు.



బొప్పాయి రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి

కొవ్వూరు: బొప్పాయి రైతులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు. మండలంలోని దొమ్మేరు గ్రామంలోని కోరుకోండ సత్యనారాయణ అనే రైతుకు చెందిన బొప్పాయి తోటను శుక్రవారం శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బొప్పాయి, ఇతర పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం విత్తనాలు, డ్రిప్ పరికరాలను సబ్సిడీపై అందించాలన్నారు. బొప్పాయిలో సాగు సమస్యలను ఆయన రైతును అడిగి తెలుసుకున్నారు.

వీలునామా నోటీసు

[illegible]

సబ్ రిజిస్ట్రారు కార్యాలయం, సఖ్యాపురం, ది.15.09.2023

సబ్ రిజిస్ట్రారు, సఖ్యాపురం



